
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్

జిల్లాల వార్తలు

శనివారం 14 సెప్టెంబరు 2024

పరిశ్రమలున్నా..
# పన్ను సున్నా

- అంతంతమాత్రంగానే వసూలు
- నిధులు లేక నీరసిస్తున్న గ్రామ పంచాయతీ

7

## మహిళల భద్రతకు భరోసా

**పారిశ్రామికవాడల్లో 'షీ-షటిల్' ప్రత్యేక బస్సులు**



షీ-షటిల్‌ను ప్రారంభిస్తున్న సంగారెడ్డి ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 13 : సంగారెడి జిల్లాలో మహిళల భద్రత కోసం పోలీసుశాఖ కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. పారిశ్రామికవాడల్లో మహిళల సురక్షిత ప్రయాణానికి సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఉచిత బస్సును జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామికవాడల్లో విధులు నిర్వహిస్తున్న మహిళల భద్రత, సురక్షిత ప్రయాణానికి సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో న్యూలాండ్ పరిశ్రమ సహకారంతో రూ.34 లక్షలతో నూతన షీ-షటిల్ బస్సును ప్రారంభించినట్లు తెలిపారు. పరిశ్రమల భద్రత, ట్రాఫిక్ సమస్య, మహిళలపై జరుగుతున్న వివిధరకాల నేరాలను అరికట్టేందుకు ఈ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళల సురక్షిత ప్రయాణానికే ప్రత్యేక బస్సును ప్రారంభించినట్లు తెలిపారు. ఈ బస్సు గాగిల్లాపూర్ నుంచి జిన్నారం రూట్‌లో ప్రతీరోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం నడుస్తుందని తెలిపారు. మహిళలు, స్కూల్ పిల్లలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్‌సీ వైస్ చైర్మన్, అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి రమణారెడ్డి, రవి, అశోక్, రాము, రామకృష్ణ, డీవీరెడ్డి, శ్రీధర్‌నాయక్, భాస్కర్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## భూ వివాదంతో విసిగి.. రైతు ఆత్మహత్య

- తల్లి, చెల్లి.. నేతల అండతో చంపే ప్రయత్నం చేస్తున్నారని సెల్ఫీ వీడియో తీసి గడ్డిమందు తాగిన వ్యక్తి
- చికిత్స పొందుతూ మృతి
- మృతదేహంతో బైఠాయించిన గ్రామస్థులు

7లో

'సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్, బుస్సాపూర్ గ్రామాల్లో సర్పంచ్ పదవి ఆశిస్తున్న ముగ్గురేసి అభ్యర్థులు గ్రూపులుగా ఏర్పాటై చందాలు, విరాళాలు అందిస్తున్నారు. శుభ, అశుభ కార్యాలకు తమవంతు సాయం చేయడానికి పోటీపడుతున్నారు. ఏడాదిగా నువ్వా నేనా అన్నట్లుగా గ్రూపులు కడుతున్నారు.'

'సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని ఓ గ్రామంలో సర్పంచ్ పదవి ఏకగ్రీవం చేసేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. రోజూ దావత్‌లు జరుగుతున్నాయి. ఆశావహులు సొంత డబ్బులతో వినాయక విగ్రహాలు, వైకుంఠరథాలు, క్రికెట్ కిట్లు అందించారు. చావులు, పెళ్లిళ్లకు సొంతంగా సాయం చేస్తున్నారు. ఇదే మండలంలోని మరో మూడు గ్రామాల్లోనూ ఆశావహులు పోటాపోటీగా ఖర్చు పెడుతున్నారు.'

'మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం మహ్మద్‌నగర్ గ్రామానికి చెందిన రవియాదవ్ అనే యువకుడు తనను సర్పంచ్‌గా గెలిపించాలని కోరుతున్నాడు. ఇతర పనులతోపాటు వీధి దీపాలకు ఆర్థిక సహాయం చేయడానికి ముందుకొచ్చాడు. ఇక కౌడిపల్లిలోనూ సర్పంచ్ రేసులో ఉన్న ఇద్దరు వేర్వేరు పార్టీల నేతలు గ్రామంలో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియల నిమిత్తం రూ.5వేల సాయం చేస్తున్నారు.'

# నేనే సర్పంచ్..!

**ఎన్నికలకు ముందే పోటాపోటీ తాయిలాలు**

- ఖర్చులకు వెనుకాడని ఆశావహులు
- గ్రామాల్లో పనులకు సొంత డబ్బులు
- విరాళాలు, విహారాలు, విందులతో ఆకర్షణ
- ఏడాదిగా ఇదే తంతు..
- కులగణన దృష్ట్యా మరో 3 నెలలు తప్పని ఖర్చులు



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, సెప్టెంబరు 13: గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల వాతావరణం వేడెక్కింది. ఓటర్లను ఆకట్టుకోవడానికి ఆశావహులు విభిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఏ పనైనా చేయడానికి సిద్ధం అంటున్నారు. ఇటీవల రుణమాఫీ జరగని రైతులకు అండగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. రూ.500కే సిలిండర్, ఉచిత విద్యుత్ అందనివారి జాబితా తీసుకొని అమలయ్యేలా ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతోపాటు వ్యక్తిగతమైన పనులకూ చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. ముఖ్యంగా యువతను ఆకర్షించడానికి క్రికెట్‌మ్యాచ్‌లు నిర్వహించడం, వినాయక విగ్రహాలు పెట్టించడం, దుర్గామాత వేడుకలకు ప్రణాళికలు సిద్ధం చేయడం, బతుకమ్మ, దసరా సందర్భంగా బహుమతులు ఇవ్వడంపై దృష్టిపెట్టారు.

**గ్రామపంచాయతీల వివరాలు**

| జిల్లా | గ్రామాలు | వార్డులు | పల్లె ఓటర్లు |
|---|---|---|---|
| సంగారెడ్డి | 658 | 5,834 | 8,36,370 |
| సిద్దిపేట | 514 | 4,566 | 6,16,009 |
| మెదక్ | 491 | 4.232 | 5,14,705 |

### మేమున్నామంటూ..

- నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌లో తాజామాజీ ఎంపీటీసీ భానుచందర్ నిరుపేదల పెళ్లిళ్లకు పుస్తెమట్టెలు అందిస్తున్నారు.
- మునిపల్లి మండలంలోని మల్లికార్జునపల్లి, అల్లాపూర్, చిన్నచల్మెడ, మునిపల్లి గ్రామాల్లో ఆశావహులు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఓటర్లను ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నారు.
- దూల్మిట్టలో ఒకరు పెళ్లిళ్లకు పుస్తెమట్టెలు, నిరుపేదలు చనిపోతే రూ.5వేలు, ఆలయాల అభివృద్ధికి సహకరిస్తున్నారు.
- జిన్నారం మండలంలోని ఓ గ్రామంలో సర్పంచ్‌గా ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ అనుచరులను గోవా, తదితర ప్రాంతాలకు విహారానికి తీసుకెళ్లారు.
- మనోహరాబాద్ మండలం రంగాయపల్లిలో ఒకరు స్థానిక పాఠశాలలో రూ.6లక్షలు వెచ్చించి సరస్వతీమాత విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. కోనాయపల్లిలో ఇద్దరు అభ్యర్థులు ఆలయాలకు, విగ్రహాలకు పోటాపోటీగా ఖర్చు చేస్తున్నారు.
- మాసాయిపల్లి మండలం రామంతపూర్, బొమ్మారం, పోతన్‌శెట్టిపల్లి, అచ్చంపేట, కొప్పులపల్లి గ్రామాల్లో వినాయక విగ్రహాలకు విరాళాలు, అన్నదానాలు చేస్తూ తాము కూడా రేసులో ఉన్నామంటున్నారు ఆశావహులు.
- కుకునూరుపల్లి మండలంలోని రెండు గ్రామాల్లో సర్పంచ్‌గా పోటీచేయాలనుకున్న ఆశావహులు ఆ గ్రామానికి చెందిన పెద్ద మనుషులు, యువకులను వేర్వేరుగా విహారయాత్రలకు తీసుకెళ్లారు.
- వర్గల్ మండల కేంద్రంలో సర్పంచ్ రేసులో ఉన్న నాయకుడు ఇటీవల వర్షానికి బురదమయమైన కాలనీలో తన సొంత డబ్బులతో మట్టిపోయించి చదును చేయించారు.

### రిజర్వేషన్లు మారితే ఆగమే..

ఈ ఏడాది జనవరి నెలతో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. తిరిగి ఎన్నికలు నిర్వహించని ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టాలని నిర్ణయించి, గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమించింది. ఇంతలో పార్లమెంటు ఎన్నికలు రావడంతో కుల గణన జాప్యమైంది. సెప్టెంబరు నెలలో ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వ పెద్దలు ప్రకటించడంతో మళ్లీ ఆశలు ఊపందుకున్నాయి. తాజాగా ఎన్నికల నిర్వహణపై హైకోర్టు ప్రశ్నించగా మరో 3 నెలల సమయం కావాలని ప్రభుత్వం కోరింది. ఈ లెక్కన డిసెంబరులో ఎన్నికలు జరుగుతాయని అంచనా. అప్పుడు కూడా ఇవే రిజర్వేషన్లు కొనసాగుతాయా.. మారుతాయా.. అనే విషయంపై స్పష్టత లేదు. రిజర్వేషన్లు తమకే అనుకూలంగా ఉంటాయని ఎడాపెడా ఖర్చుచేస్తున్న ఆశావహుల పరిస్థితి అటుఇటైనా ఆశ్చర్యపోనక్కర్లేదు. కానీ, ఆశావహులు మాత్రం రిజర్వేషన్లు మారితే వార్డు సభ్యుడిగా గెలిచి ఉప సర్పంచ్ పదవి చేపట్టవచ్చని ఆశతో ఉన్నారు. లేదా, ఎంపీటీసీగానైనా పోటీలో ఉండొచ్చని నమ్మకాన్ని ప్రదర్శిస్తున్నారు.

# నాలుగోసారైనా..?

- చేప పిల్లల పంపిణీకి మరోసారి టెండర్లు
- ఇప్పటికే మూడుసార్లు నిరాశ..
- ఈ నెల 19తో ముగియనున్న గడువు
- సగానికి తగ్గిన పంపిణీ లక్ష్యం
- అయినా ముందుకురాని కాంట్రాక్టర్లు







మెదక్‌లోని జిల్లా మత్స్యశాఖ కార్యాలయం

మెదక్, సెప్టెంబరు 13: ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమానికి ఆది నుంచి అవాంతరాలే ఎదురవుతున్నాయి. చేప విత్తనం పంపిణీ చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా 5 జిల్లాల్లో ఈ పరిస్థితి ఉండగా.. ఇందులో మెదక్ జిల్లా కూడా ఒకటి. మెదక్ జిల్లాలో మూడోసారి టెండర్లు పిలిచినా స్పందన లేకపోవడంతో చేపపిల్లల పంపిణీ లక్ష్యాన్ని కుదించి నాలుగోసారి కాంట్రాక్టర్ల నుంచి బిడ్లను ఆహ్వానించినట్లు జిల్లా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి మల్లేశం తెలిపారు.

**1,572 చెరువులు.. 306 సొసైటీలు**

మెదక్ జిల్లావ్యాప్తంగా 1,572 చెరువులున్నాయి. పోచారం, ఘనాపూర్ జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. వీటి పరిధిలో ఉన్న 306 మత్స్య సహకార సంఘాల్లో 16,820 మంది సభ్యులు ఉన్నారు. జూలై, ఆగస్టు మాసాల్లో ప్రభుత్వం ఉచిత చేపపిల్లల పంపిణీ చేపట్టేది. ప్రాజక్టులు, పెద్ద జలాశయాల్లో పెంచేందుకు 80-100 ఎంఎం సైజు చేపపిల్లలను, చెరువులు, కుంటల్లో పెంచేందుకు 40-50 ఎంఎం సైజులో ఉండే చేపపిల్లలను పంపిణీ చేసేందుకు మత్య శాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ సంవత్సరం ఇప్పటివరకూ టెండర్ల ప్రక్రియ పూర్తికాకపోవడంతో చేపల వేటపై ఆధారపడ్డ మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. గత సంవత్సరం కూడా ప్రభుత్వం ఉచిత చేపపిల్లల పంపిణీని ఆలస్యంగా చేపట్టింది. ఆగస్టు చివరలో చేప విత్తనాన్ని జిల్లాలో పంపిణీ చేశామని అధికారులు చెబుతున్నారు. గతేడాది చేపపిల్లలు పంపిణీ చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంతో ఈసారి టెండర్లలో పాల్గొనడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు.

**సగానికి తగ్గిన లక్ష్యం**

జిల్లాలోని చెరువులు, జలాశయాల్లో రూ. 5.25 కోట్ల చేపపిల్లలను వదలాలని జిల్లా మత్స్యశాఖ ప్రభుత్వానికి ప్రణాళిక అందజేసింది. ఈమేరకు గత జూలై 10న ఆన్‌లైన్ టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు పాల్గొనలేదు. టెండర్ల తుది గడువును జూలై 23 వరకు పొడిగించినా బిడ్లు దాఖలు చేయలేదు. మళ్లీ ఆగస్టు 13న మరోసారి టెండర్లు ఆహ్వానించారు. మూడోసారి కూడా ఎవరూ ముందుకు రాకపోవడంతో తాజాగా ఈ నెల 9న బిడ్‌లు పిలిచారు. తుది గడువు 19న ముగియనుంది. చేప విత్తనం పంపిణీకి బిడ్డర్లు ఆసక్తి కనబర్చకపోవడంతో పాటు జలాశయాల్లో చేపపిల్లలను వదలడానికి సమయం ముగుస్తుండడంతో జిల్లాలో చేపపిల్లల పంపిణీ లక్ష్యాన్ని కుదించారు. ముందుగా అనుకున్నట్లుగా కాకుండా ఈ సంవత్సరం 2.625 కోట్ల విత్తనాన్ని మాత్రమే పంపిణీ చేయడానికి టెండర్ల ప్రక్రియను నిర్వహిస్తున్నారు.

### ఆయిల్‌పామ్ సాగు

# లక్ష్యం 2వేల ఎకరాలు

**జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి : మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్**

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 13: ఆయిల్‌పామ్ సాగులో మెదక్ జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషిచేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మెదక్ పట్టణంలోని నస్కెట్‌లో ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి మెదక్ జిల్లాలో 2వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలను సాగు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, ఇప్పటివరకు 1,176 ఎకరాలకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, 25 ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తయిందని తెలిపారు. గతేడాది 74 మంది రైతులు 336 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశారని, ఇందుకోసం రూ. 13 లక్షల సబ్సిడీని రైతుల ఖాతాలో జమ చేశామని చెప్పారు. ఆయిల్‌పామ్ సాగు చేయాలనుకునే రైతులు మెదక్, నర్సాపూర్ ఉద్యానవనాధికారులను 8977714423, 8977714422 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన మరియు పట్టి పరిశ్రమశాఖ అధికారి ప్రతాప్ సింగ్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ మొక్కను నాటి నీరు పోస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

**సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి**

రామాయంపేట: సీజనల్ వ్యాధుల బారినపడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. రామాయంపేట మండల పరిధి అక్కన్నపేట గ్రామంలో శుక్రవారం ఆయన పరిశీలించారు. పారిశుధ్యం, నీటి సరఫరా నిర్వహణను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ రజని ఉన్నారు.

నవ భారత నిర్మాణమే
# బీజేపీ లక్ష్యం

- మోదీ పాలనలో వేగంగా దేశాభివృద్ధి
- రానున్న రోజుల్లో అతిపెద్ద పార్టీగా బీజేపీ
- యాపిల్, ఐఫోన్లను ఎగుమతి చేసే దేశంగా ఇండియా
- కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్
- సభ్యత్వ నమోదులో మెదక్‌ను ప్రథమ స్థానంలో నిలపాలి : ఎంపీ రఘునందన్

7



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్



ఉత్తమ ఉపాధ్యాయులతో మంత్రి

# విద్యా బోధన గురుతర బాధ్యత

- ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట, సెప్టెంబరు 13: విద్యా బోధనను వృత్తిగానే కాకుండా బాధ్యతగా భావించాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. అందోలులోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన నియోజకవర్గస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు తాము పనిచేసే బడి, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతో విద్యను నేర్పించాలని సూచించారు. సమాజ నిర్మాణంలో టీచర్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అత్యంత గౌరవప్రదమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని కొనియాడారు. విలువలతో కూడిన విద్యను నేర్పించడం ద్వారా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రభుత్వాలను మార్చే శక్తి కూడా టీచర్లకుందని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటులో టీచర్ల పాత్ర గణనీయమైనదని కొనియాడారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు సీఎం కృషి చేస్తున్నారని అన్నారు. గతంలో వైఎస్ హయాంలోనే 58వేల పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. అప్పట్లో విద్యాశాఖ మంత్రిగా అందోలు నియోజకవర్గానికి జేఎన్‌టీయూ, మూడు పాలిటెక్నిక్ కళాశాలలు, మహిళా డిగ్రీ కళాశాల, పీజీ కాలేజీలను తీసుకువచ్చానని గుర్తుచేశారు. ప్రస్తుతం వైద్యశాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగానే, అందోలు-జోగిపేటలో నర్సింగ్ కాలేజీని ఏర్పాటు చేయించానని, దానికి అనుబంధంగా 100 పడకల ఆసుపత్రిని నిర్మిస్తామని చెప్పారు. నియోజకవర్గంలో ప్రతీ కస్తూర్బా, మోడల్ పాఠశాలకు రూ. కోటి సీఎస్ఆర్ ఫండ్ కేటాయిస్తానని చెప్పారు. అనంతరం నియోజకవర్గంలోని 9 మండలాల పరిధిలోని 128 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు చిట్టిబాబు, శంకర్, సురేందర్‌గౌడ్, చందర్, నాగరాజు, నాయకులు ఎం.జగన్మోహన్‌రెడ్డి, సత్యనారాయణ, ప్రవీణ్, ఆర్డీవో పాండు, డిప్యూటీ తహసీల్దార్ సాగర్ మధుకర్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాణయ్య, మదన్‌గోపాల్, నాసిర్‌పటేల్, నరోత్తం, రాజమల్లు, మధు, వీబీ శ్రీనివాస్, అనిల్, నవీన్, సుభాష్, చంద్రశేఖర్, ఎనగండ్ల శేఖర్, మహేశ్‌చారి, మాయాచారి తదితరులు పాల్గొన్నారు

# మందుల సరఫరాలో జాప్యం వద్దు

**నిబంధనల ప్రకారం నిల్వ చేయాలి : టీజీఎంఎస్ఐడీసీ ఈడీ కౌటిల్య**

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 13 : సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను తెలంగాణ వైద్య సేవలు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఎంఎస్ఐడీసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కౌటిల్య శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టోర్‌లో మందుల నిల్వ, స్టాక్ వివరాలు, ఇండెంట్, సరఫరాలను పరిశీలించారు. నిబంధనల ప్రకారం స్టోర్ చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఇతర సర్కారు ఆస్పత్రులు ఇచ్చిన ఇండెంట్ ప్రకారం సకాలంలో మందులు సరఫరా చేస్తున్నారా.. లేదా అని ఆరా తీశారు. అనంతరం కొండాపూర్ పీహెచ్‌సీని ఆయన సందర్శించి మందులు నిల్వ వివరాలు ఫార్మసిస్టుపే అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ నిబంధనల ప్రకారం మందుల నిల్వ చేయాలని, సర్కారు ఆస్పత్రులు ఇచ్చిన ఇండెంట్ ప్రకారం సకాలంలో మందుల సరఫరా చేయాలని ఆదేశించారు. సరఫరాలో ఏమాత్రం జాప్యం చేయరాదని సూచించారు. కార్యక్రమంలో టీజీఎంఎస్ఐడీసీ ఈఈ రవీందర్‌రెడ్డి, డీఈ విల్సన్, ఏఈ వెంకటేశ్, శివ, సీడీఎస్ స్టోర్ ఫార్మసిస్ట్ ఫాతిమా, సిబ్బంది పరమేశ్ తదితరులు ఉన్నారు.



సంగారెడ్డి సీడీఎస్ గోదాంలో మందులను పరిశీలిస్తున్న ఈడీ కౌటిల్య

# ఈజీఎస్ అధికారులపై ఖేడ్ ఎమ్మెల్యే ఆగ్రహం

కల్హేర్, సెప్టెంబరు 13: మండలంలో నాటిన మొక్కల వివరాలు తెలపాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఈజీఎస్ అధికారులను కోరగా సమాధానం చెప్పలేక నీళ్లు నమిలిన సంఘటన కల్హేర్‌లో జరిగింది. ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి కల్హేర్ ఎంపీపీ కార్యాలయాన్ని శుక్రవారం తనిఖీ చేసి గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, వ్యవసాయ, రెవెన్యూశాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సీజన్‌లో మండలంలో నాటిన మొక్కల వివరాలు తెలపాలని, వాటిలో ఎన్ని బతికి ఉన్నాయనే వివరాలను కల్హేర్ ఈజీఎస్ ఈసీ వేణుగోపాల్, టీఏలు బన్సీలాల్, శ్రీనివాస్‌రెడ్డిలను ఎమ్మెల్యే కోరగా వారి వద్ద వివరాలు లేకపోవడంతో సమాధానం చెప్పలేకపోయారు. తప్పుడు రికార్డులు చూపిస్తున్నారా అని వారిపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. వివరాలు అరగంటలో తీసుకురావాలని, వాటిని తనిఖీ చేస్తానని ఎమ్మెల్యే వారికి సూచించినా ఫలితం లేకపోయింది. దీంతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం ముగించి వెళ్లిపోయారు. మరో రెండు రోజుల్లో పూర్తి వివరాలు తెలియజేయాలని, లేదంటే చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. అంతకు ముందు సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే గ్రామాల్లో మంచినీటి సరఫరాలో ఇబ్బందులు రావద్దని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, తహసీల్దార్ శివశ్రీనివాస్, ఎంపీడీవో రమేష్ బాబు, ఈజీఎస్ ఏపీవో శ్యాంకుమార్, కల్హేర్ మాజీ ప్యాక్స్ చైర్మన్లు వీరశెట్టి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కామిని చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి




**ఆకట్టుకున్న వినాయకుల వేషధారణ**

వినాయక నిమజ్జనం సందర్భంగా నారాయణఖేడ్ పట్టణంలోని నియోప్రగతి పాఠశాల విద్యార్థులు వినాయకుల వేషధారణ ఆకట్టుకున్నది. పాఠశాలలో ప్రతిష్ఠించిన వినాయకుడిని, వినాయకుల వేషధారణతో ,చిన్నారుల నృత్యాలతో నిమజ్జనానికి తరలించారు.

నారాయణఖేడ్, సెప్టెంబరు 13

## దుబాయ్‌లో మృతి..
# స్వగ్రామానికి చేరిన మృతదేహం



అంత్యక్రియల్లో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 13 : దుబాయ్‌లో మృతిచెందిన మెదక్ జిల్లా తిమ్మక్కపల్లికి చెందిన రాట్ల సూర్య నాయక్ మృతదేహం కోసం పదిహేను రోజులగా ఎదురుచూస్తుండగా శుక్రవారం స్వగ్రామానికి చేరుకున్నది. వివరాల్లోకి వెళితే.. రాట్ల సూర్య అబుదాబీలో మరణించాడని వార్త తెలిసిన వెంటనే కుటుంబసభ్యులు, గ్రామస్థులు బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావును ఆశ్రయించారు. ఎంపీ వెంటనే స్పందించి భారత ప్రభుత్వ ఎంబీసీ, అబుదాబీలో ఒక అడ్వకేట్‌తో మాట్లాడి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావాలని రాజా శ్రీనివాసరావు బృందానికి సూచించారు. రాజా శ్రీనివాసరావు బృందం, గల్ఫ్ జేఏసీ ఉపాధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి వెంటనే స్పందించి మృతదేహాన్ని ఉచితంగా తేవడానికి కృషి చేశారు. శుక్రవారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ఉదయం ఐదు గంటలకు చేరుకున్నది. అక్కడ నుంచి మృతుడి ఇంటికి అంబులెన్సు ద్వారా తీసుకొచ్చారు. మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు సహకరించిన అధికారులకు, రాజా శ్రీనివాస బృందానికి, ఎంపీ రఘునందన్‌రావుకు కుటుంబసభ్యులు ధన్యవాదాలు చెప్పారు. అంత్యక్రియలలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## భూ వివాదంతో విసిగి.. రైతు ఆత్మహత్య

- నేతలతో అండతో తల్లి, చెల్లి చంపే ప్రయత్నం చేస్తున్నారని సెల్ఫీ వీడియో తీసి గడ్డిమందు తాగిన వ్యక్తి
- చికిత్స పొందుతూ మృతి
- మృతదేహంతో బైఠాయించిన గ్రామస్థులు



రోడ్డుకు అడ్డుగా అంబులెన్స్‌ను పెట్టి, ఆందోళన చేస్తున్న గ్రామస్థులు, పున్న స్వామి(ఫైల్)

రామాయంపేట, సెప్టెంబరు 13 : తోబుట్టువుల భూ వివాదంలో విసిగిన రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఈ ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండల పరిధి చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని సుతార్‌పల్లికి చెందిన పున్న స్వామి(45)కి తల్లి, చెల్లెళ్లతో భూ పంచాయితీ నడుస్తోంది. తల్లి, చెల్లి ఇద్దరు కాంగ్రెస్ నేతల అండతో తరచూ స్వామిని వేధించసాగారు. నాలుగు రోజుల క్రితం తన పౌల్ట్రీఫాంలో గడ్డిమందు తాగి సెల్ఫీ వీడియోలో తన చావుకు కారకులను బయట పెట్టాడు. నేతలను అడ్డు పెట్టుకుని తోబుట్టువులు తనను చంపే ప్రయత్నం చేస్తున్నారని.. ఇక తానే ఆత్మహత్య చేసుకుంటున్నాని సెల్ఫీ వీడియోలో తెలిపాడు. అపస్మారక స్థితికి చేరిన అతన్ని కుటుంబీకులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా శుక్రవారం పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. మధ్యాహ్నం అంబులెన్స్‌లో మృతదేహాన్ని తీసుకురాగా.. గ్రామస్థులు రామాయంపేటకు చేరుకుని రోడ్డుపై బైఠాయించారు. ఆరు గంటల పాటు ఆందోళన చేపట్టగా.. పోలీసులు నచ్చ చెప్పినా వినలేదు. దీంతో వాగ్వాదం నెలకొన్నది. సీఐ వెంకట రాజాగౌడ్ బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామంటూ హామీ ఇవ్వడంతో సాయంత్రం ధర్నా విరమించారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రి పోస్టుమార్టం గదిలో భద్రపర్చారు.

## రోడ్డు ప్రమాదంలో చిరు వ్యాపారి మృతి

రామచంద్రాపురం, సెప్టెంబరు 13 : రోడ్డు ప్రమాదంలో చిరువ్యాపారి దుర్మరణం పాలైన ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెల్లాపూర్‌లో చోటుచేసుకున్నది. ఎస్ఐ సురేష కథనం ప్రకారం.. కొమురంభీం కాలనీలో నివాసముంటున్న శ్రీను(54) ఉస్మాన్‌నగర్‌లో ఇసుక వ్యాపారం చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నారు. రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం బైక్‌పై తన అడ్డాకు బయలుదేరాడు. ఎలియన్స్ ఫేస్ స్టేషన్, రాఘవేంద్ర టిఫిన్ సెంటర్ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పరు లారీ బైక్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో శ్రీను అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

## అడవి జంతువును తప్పించబోయి యువకుడు

హవేళిఘణపూర్, సెప్టెంబరు 13 : అడవి జంతువును తప్పించబోయి బైక్ పైనుంచి పడి యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని సర్దన శివారులో శుక్రవారం చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. ఫరీద్‌పూర్ గ్రామానికి చెందిన దాసరి బ్రహ్మం కుమారుడు దాసరి సాయికుమార్(18) ఫ్రెండ్స్ దగ్గరికి వెళ్తున్నాని ఇంట్లో చెప్పి, స్నేహితుడు గణేష్‌తో కలిసి ద్విచక్రవాహనంపై సర్దన గ్రామానికి వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో ఒక్కసారిగా అడవి జంతువు రోడ్డుపైకి రావడంతో దానిని తప్పించబోయి బైక్ పైనుంచి వారు కింద పడ్డారు. సాయికుమార్ తలకు తీవ్రగాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న కుటుంబీకులు క్షతగాత్రులను వెంటనే మెదక్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ సాయికుమార్ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. మృతుని తండ్రి బ్రహ్మం ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

## స్నేహితుడి వద్దకు వెళ్లొస్తానని..
## రోడ్డు పక్కన మృతదేహమై కనిపించి..

జిన్నారం, సెప్టెంబరు 13: స్నేహితుడి దగ్గరికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బైక్‌పై వెళ్లిన ఒకరు గాయాలై రోడ్డు పక్కన పడి మృతిచెంది కనిపించిన సంఘటన జిన్నారం మండల పరిధిలో వెలుగుచూసింది. ఎస్ఐ నాగలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడిదల మండలం వీరన్నగూడెం గ్రామానికి చెందిన సయ్యద్(47) ఈనెల గురువారం జిన్నారంలోని స్నేహితుడు సత్యనారాయణను కలువడానికి వెళ్లి తిరిగి రాలేదు. సయ్యద్ కోసం భార్య గౌసియా, స్నేహితుడు సత్యనారాయణలు ఫోన్‌చేయగా.. స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో 13న సయ్యద్ ఆచూకీ కోసం ప్రయత్నించగా.. జిన్నారం శివారులోని అల్యూమినియం పరిశ్రమ సమీపంలో రహదారి పక్కన పడి తీవ్ర గాయాలై మృతి చెంది కనిపించాడు. మృతుడి భార్య గౌసియా ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. బైక్‌పై నుంచి పడి మృతిచెంది ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.

## అప్పులబాధతో యువకుడు ఆత్మహత్య

దుబ్బాక, సెప్టెంబరు 13 : అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం దుబ్బాకలోని డబుల్‌బెడ్‌రూం సముదాయంలో చోటుచేసుకున్నది. ఎస్ఐ గంగరాజు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మర్కంటి నరేష్(37) వివిధ అవసరాల కోసం అప్పులు చేశాడు. అప్పులను తీర్చే మార్గం లేక ఇంట్లో ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## మున్సిపాలిటీ స్థలమని వాగ్వాదం

తూప్రాన్, సెప్టెంబరు 13: ఓ స్థలం విషయంలో వాగ్వాదం చోటు చేసుకున్న ఘటన తూప్రాన్ పట్టణంలో శుక్రవారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని పిట్టల లచ్చిగౌరి ఎక్స్‌కవేటర్‌తో స్థలాన్ని చదును చేయిస్తుండగా కొందరు అక్కడకు చేరుకొని పనులు అడ్డుకున్నారు. ఇది పట్టా భూమి అని లచ్చిగౌరి తెలపగా, మున్సిపాలిటీకి చెందిన స్థలమంటూ పనులను అడ్డుకున్న వారు ఆతడితో వాగ్వాదానికి దిగారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు వర్గాలను సముదాయించారు. ఫిర్యాదులు చేయాలని, భూమి పత్రాలు తీసుకొని పోలీసుస్టేషన్‌కు రావాలంటు సూచించారు.

# కళాశాలలో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి

- విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి



విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

మద్దూరు, సెప్టెంబరు 13 : కళాశాలలో మౌలిక వసతులను తక్షణమే ఏర్పాటు చేసేలా చూస్తామని విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి తెలిపారు. శుక్రవారం డీఏవో రవీందర్‌రెడ్డితో కలిసి ఆకునూరు మురళి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు మోడల్ స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల విద్యార్థులు పుష్పగుచ్ఛం అందించి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం కళాశాలలో నెలకొన్న సమస్యల్ని అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. స్టాఫ్‌తో పాటు విద్యార్థులు ఎంత మంది కళాశాలకు వస్తున్నారని అడిగి క్లాసు రూంలను పరిశీలించారు. కళాశాలలో కాంపౌండ్ వాల్‌తో పాటు మరుగుదొడ్లు, మూత్రశాలలపై ఆరా తీశారు. తక్షణమే ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఏఈని ఆదేశించారు. బడ్జెట్‌కు ఇబ్బంది లేదని, కాంట్రాక్టర్లతో రెండు నెలల్లో పనులు పూర్తి చేయించాలని, మళ్లీ వచ్చి చూస్తానని ఆకునూరు మురళి అన్నారు. అనంతరం మోడల్ స్కూల్‌ను సందర్శించి అధ్యాపకుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. బోధన తీరుపై సబ్జెక్ట్ వారీగా అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని పైఅంతస్తులో జరుగుతున్న క్లాసురూంల పనులను పరిశీలించారు. వాటర్ లీకేజీలపై ఏఈని మందలించారు. త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సూచించారు. అనంతరం కస్తూర్బా పాఠశాలను సందర్శించి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌రెడ్డి, సూపరెండెంట్ మూర్తి ఉన్నారు.

# పరిశ్రమలున్నా.. పన్ను సున్నా

- అంతంత మాత్రంగానే వసూలు
- నిధులు లేక నీరసిస్తున్న జీపీ

మనోహరాబాద్, సెప్టెంబర్ 13 : అంగట్లో అన్ని ఉన్నా.. అన్న సామెత మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామానికి సరిగ్గా సరిపోతుంది. ఈ గ్రామానికి పరిశ్రమల నుంచి ఆదాయం వచ్చే అవకాశం మెండుగా ఉన్నా.. గ్రామ పంచాయతీ కార్యాలయం ఇంకా అద్దె భవనంలోనే సాగుతుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కనీసం పారిశుధ్య పనులు చేపట్టేందుకు జీపీ వద్ద నిధులు లేక.. ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో ఎక్కడ పడితే అక్కడ చెత్త దర్శనమిస్తోంది. దీంతో సీజనల్ వ్యాధుల భయం ఆ గ్రామాన్ని వెంటాడుతోంది.

### వందకుపైగా..

కాళ్లకల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో సుమారు వందకుపైగా చిన్నా పెద్దా పరిశ్రమలు ఉన్నాయి. 30 ఏళ్ల క్రితం ఇక్కడ నాలుగు ఎకరాల్లో చిన్నా.. పెద్ద పరిశ్రమలు ఏర్పాటు చేశారు. ఇప్పుడు గ్రామంలోని సుమారు 20 ఎకరాల్లో పరిశ్రమలు ఉన్నాయి. ఇవన్నీ చూసే పరిశ్రమల నుంచి గ్రామానికి పెద్ద ఎత్తున పన్ను రావాల్సి ఉంటుంది. వాస్తవానికి అయా పరిశ్రమల నుంచి సరిగ్గా పన్ను వసూలు చేస్తే గ్రామ పంచాయతీకి ఏటా రూ. 2కోట్ల వరకు ఆదాయం వస్తుంది. కానీ, ప్రస్తుతం పరిశ్రమల నుంచి కేవలం రూ. 90 లక్షలు మాత్రమే పన్నుల రూపంలో వస్తోంది. ఇక గ్రామ పంచాయతీకి సొంత భవనం లేకపోవడంతో జీపీ నిధులు, గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 65 లక్షలతో నూతన భవన నిర్మాణం చేపట్టారు. నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు.

### ఇదీ జరుగుతున్నది..

కాళ్లకల్‌లో పరిశ్రమలకు ఏళ్ల క్రితం పన్ను మదింపు చేశారు. అప్పట్లో పన్నులు తక్కువగా ఉండగా.. ఇప్పుడు కొందరు పరిశ్రమలను విస్తరించారు. ఏళ్లుగా పన్ను మదింపు లేకపోవడంతో తక్కువగా వసూలవుతోంది. కొందరు అధికారులు, నేతలు పరిశ్రమల యాజమాన్యాలతో కుమ్మక్కై తక్కువ మొత్తం పన్ను వచ్చేలా చేస్తున్నారు. దీంతో పంచాయతీ ఆదాయానికి గండి పడుతోంది.



కాళ్లకల్ గ్రామ శివారులోని ఓ పరిశ్రమ

### పన్నులు పూర్తిగా చెల్లించడం లేదు



కాళ్లకల్ మేజర్ జీపీ పరిధిలో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల నుంచి పన్ను వసూలు చేసే విషయంలో అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు. నిధులు లేక గ్రామంలో పారిశుధ్యం పడకేసింది. అధికారులు స్పందించి పరిశ్రమల నుంచి పన్నులు వసూలు చేసి గ్రామాభివృద్ధికి వినియోగించాలి.

- సర్వీన్‌గౌడ్, గ్రామస్థుడు

### అధికారుల సూచనల మేరకే పన్ను వసూలు



ప్రభుత్వ సూచనల మేరకు గతంలో ఉన్న మాదిరిగా పన్నులను వసూలు చేస్తున్నాం. 2018 వరకు గ్రామ పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసి పన్నులను పెంచింది. ఐదేళ్లకు ఒకసారి పన్ను పెంచడం జరగాలి కాని, 1998 సంవత్సరం వరకు మాత్రమే పెంచినట్లు రికార్డులు ఉన్నాయి. పరిశ్రమల విస్తీర్ణం పెరిగిన విషయం వాస్తవమే.

- రాజు, కాళ్లకల్ పంచాయితీ కార్యదర్శి

## ఆవర్తన పట్టికను అవపోసన పట్టింది

- దామరకుంట ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అరుదైన రికార్డు



సైన్స్ ఉపాధ్యాయుడు చిన్నబ్రహ్మం, విద్యార్థిని భవానిని అభినందిస్తున్న జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

మర్కుక్, సెప్టెంబరు 13: సిద్దిపేట సమీకృత కలెక్టర్ భవన సముదాయ మీటింగ్‌హాల్‌లో రెండు రోజులపాటు నిర్వహించిన సెంటర్ ఫర్ క్రియేటివ్ లెర్నింగ్ కార్యశాల ముగింపు రోజున మర్కుక్ మండలంలోని దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న భవాని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారుల సమక్షంలో అద్భుతాన్ని ఆవిష్కరించింది. ఆవర్తన పట్టికలోని అన్ని మూలకాలను రికార్డ్ సమయంలో చదివి వినిపించి అందరినీ అబ్బురపరిచింది. మూడో ప్రయత్నంలో 12.15 సెకండ్ల సమయంలో ఆవర్తన పట్టికలోని 118 మూలకాలను చదవడం ఒక రికార్డుగా చెప్పవచ్చునని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. అమ్మాయి ప్రతిభకు ముగ్ధుడయ్యానని, భవానికి తోడ్పాటునందించిన ఉపాధ్యాయుడు చిన్నబ్రహ్మయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరాములును డీఈవో ప్రత్యేకంగా అభినందించారు.

# నవ భారత నిర్మాణమే బీజేపీ లక్ష్యం

- ప్రధాని మోదీ పాలనలో వేగంగా దేశాభివృద్ధి
- రానున్న రోజుల్లో అతిపెద్ద పార్టీగా బీజేపీ
- యాపిల్, ఐఫోన్ల ఎగుమతి దేశంగా ఇండియా
- కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్
- సభ్యత్వ నమోదులో మెదక్‌ను ప్రథమ స్థానంలో నిలపాలి : ఎంపీ రఘునందన్



వంటిమామిడిలో మార్కెట్‌లో రైతుకు బీజేపీ సభ్యత్వాన్ని ఇస్తున్న రాజీవ్ చంద్రశేఖర్, ఎంపీ రఘునందన్

గజ్వేల్/మెదక్ అర్బన్, సెప్టెంబరు 13: నవ భారత నిర్మాణమే బీజేపీ లక్ష్యమని, ప్రధాని మోదీ పాలనలో వేగంగా దేశాభివృద్ధి జరుగుతోందని కేంద్ర ఐటీ శాఖ మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన గజ్వేల్, మెదక్ జిల్లా కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎంపీ రఘునందన్‌రావు, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రతిపక్షంగా, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతో ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదన్నారు. రానున్న రోజుల్లో దేశంలో బీజేపీ అతిపెద్ద పార్టీ అన్నారు. గతంలో నూటికి 90 శాతం సెల్ ఫోన్లను విదేశాల నుంచి దిగుమతి అయ్యేవని, ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన పదేళ్లల్లో యాపిల్, ఐఫోన్లను తయారు చేసి ఎగుమతి చేసే దేశంగా ఇండియా మారిందన్నారు. ప్రపంచంలో తయారవుతున్న మొబైల్స్‌లో 20 శాతం యాపిల్ ఫోన్లు ఇండియాలోనే తయారు చేస్తున్నారని, ఇదే ప్రధాని మోదీ సాధించిన ఘనతగా చెప్పుకొచ్చారు. అంతేకాకుండా యాపిల్ కంపెనీ ప్రారంభించిన తర్వాత 6.3 లక్షల మందికి కొత్తగా ఉద్యోగాలు భర్తీ చేయగా.. ఇందులో 70 శాతం మంది మహిళలకు అవకాశం కల్పించిందన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని విమర్శించే వారికి ఇది కనబడడం లేదన్నారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్ అన్నదే బీజేపీ నినాదామన్నారు. ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు. ప్రతీ భారతీయుడు బీజేపీలో చేరాలన్నదే తమ అభిమతమన్నారు. ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విదేశాల్లో భారత్ ఆత్మగౌరవం, ఔన్నత్యాన్ని అభాసుపాలు చేస్తున్నారని మండిపడ్డారు. పట్టణంలోని నవాబుపేటలో నవోదయ గణేష్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని శుక్రవారం మాజీ కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, ఎంపీ రఘునందన్‌రావుతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### ప్రధానమంత్రి మోదీతోనే దేశ భవిష్యత్తు

గజ్వేల్/ములుగు, సెప్టెంబరు 13 : దేశ భవిష్యత్తు ప్రధానమంత్రి మోదీకే సాధ్యమవుతుందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా ములుగు మండలం వంటిమామిడి మార్కెట్‌లో కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌తో కలిసి బీజేపీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. మార్కెట్‌లో రైతుతో సభ్యత్వం చేయించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ జెండాను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లె పల్లెకు పార్టీని విస్తరింపజేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు పల్లె రమేష్‌యాదవ్, గురువారెడ్డి, మాజీ ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, భాగ్యలక్ష్మి, కృష్ణయాదవ్, మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అపరిశుభ్రతకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా సమీకృత మార్కెట్



మద్యం సీసాలు



బురద గుంట

గజ్వేల్, సెప్టెంబర్ 13 : గజ్వేల్ పట్టణంలో కోట్లాది రూపాయలను వెచ్చించి ఆరు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన సమీకృత మార్కెట్ అపరిశుభ్రతకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పట్టణ నడిబొడ్డున ఉన్న సమీకృత మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నూతనంగా మార్కెట్ కమిటీ పాలకవర్గం ఏర్పడినా ఇప్పటివరకు దృష్టి సారించలేదు. ఇటీవల విద్యుత్ వైర్లకు తగులుతున్న చెట్లను, కొమ్మలను విద్యుత్ శాఖ అధికారులు కొట్టివేయగా, వాటిని ఎక్కడికక్కడ కుప్పలుగా పారవేశారు. మార్కెట్లో కుళ్లిపోయిన కూరగాయలు, ఆకుకూరలను ఓ మూలకు పారేయడం, చెత్తనంతా ఒకచోట పోగు చేయడంతో దుర్వాసన వెదజల్లుతుంది. ఇదే మార్కెట్‌లో పట్టణ ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేయగా అందులో పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగిపోయాయి. ఇక రాత్రయితే చాలు మందు బాబులు యథేచ్ఛగా మద్యం సేవించి, బాటిళ్ల ఎక్కడికక్కడ పడేసి వెళ్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని, నూతనంగా ఏర్పడిన పాలకవర్గం ఈ పరిణామాలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



సమీకృత మార్కెట్‌లో చెత్త, పాడైపోయిన కూరగాయలు

## టమాటా పంటలను పరిశీలించిన అధికారులు

**ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్**

తొగుట, సెప్టెంబరు 13: తొగుట మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షానికి 'తెగుళ్ల తంటా.. కన్నీళ్ల కంట' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం కథనం రావడంతో అధికారులు స్పందించారు. శుక్రవారం దుబ్బాక డివిజన్ హార్టికల్చర్ అధికారి రమేశ్ మండల వ్యవసాయ అధికారి మోహన్‌తో కలిసి మండలంలో అకాల వర్షాలతో పంట నష్టపోయిన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పంట కాపాడుకోవడానికి సస్యరక్షణ చర్యలపై పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలో పంట నష్టాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు పూర్తి నివేదిక అందజేస్తామని చెప్పారు. వారి వెంట ఏఈవో రాజేశ్ తదితరులు ఉన్నారు.



తుక్కాపూర్‌లో వర్షానికి దెబ్బతిన్న టమాటా పంటను పరిశీలిస్తున్న రమేశ్

# ఎక్కడపడితే అక్కడే!

## కాలుష్య జలాలు, వ్యర్థాల పారబోత

- వందల పరిశ్రమలున్నా.. ఒక్క ట్రీట్‌మెంట్ ప్లాంట్ లేని వైనం
- శుద్ధి కేంద్రాలు లేక.. పారిశ్రామిక వ్యర్థాల ప్రవాహం
- ఆచరణకు నోచుకోని కుంటల శుద్ధి, ఈటీపీ ఏర్పాటు

జిన్నారం, సెప్టెంబరు 13 : వందల సంఖ్యలో రసాయన పరిశ్రమలు ఉన్న పారిశ్రామికవాడల్లో ఒక్క శుద్ధి కేంద్రం (ఈటీపీ) లేదు.. రసాయన వ్యర్థాలను గుట్టుచప్పుడు కాకుండా బహిరంగ ప్రాంతాలకు వదిలేయటంతో గ్రామాలు, జలాశయాలు కాలుష్యం బారిన పడుతున్నాయి. ఈ ప్రభావం స్థానిక గ్రామాల ప్రజలు, మూగజీవాలపై పడి ప్రాణాలు కోల్పోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

ఉమ్మడి జిన్నారం మండలంలోని 7 గ్రామ పంచాయతీల పరిధిలోని 300 వందలకుపైగా పరిశ్రమలుండగా వాటిలో 90 శాతం రసాయ పరిశ్రమలే. ఇందులో కొన్ని తరచూ కాలుష్య జలాలను బహిరంగా వదిలి వేయటంతో సమీప ప్రాంతాల నీటి వనరులు కలుషితమయ్యాయి. కొన్ని పరిశ్రమలు అనుమతి లేని ఉత్పాదనలు చేపడితే.. మరికొన్ని అధిక ఉత్పాదనలు జరిపి వాటి వల్ల వచ్చే రసాయక వ్యర్థాలకు శుద్ధి కేంద్రాలకు(ఈటీపీ, సీటీఈపీ)లకు తరలించే అవకాశం లేక పారవేతకుల పాల్పడుతున్నారు. రసాయనాలు తరలించే ట్యాంకర్లు పారిశ్రామిక వాడలు దాటగానే రహదారుల పక్కన పారవేయడం చేస్తున్నారు. గడ్డపోతారం అయ్యమ్మ చెరువుపై భాగంలో రసాయన జలాలు నిరంతరం పారుతుంటాయి. ఇక్కడ ఇటీవల ఓ పరిశ్రమ ఔట్‌లెట్ నుంచి వెలువడుతున్న కాలుష్యంపై స్థానికులు పీసీబీ అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఇక వ్యర్థ రసాయన జలాలను శుద్ధి కేంద్రాలకు తరలిస్తే భారీగా ఖర్చు కావటం కూడా పారవేతలకు కారణం. ఒక్కో ట్యాంకరు రసాయన జలాలు శుద్ధి చేయాలంటే రూ.75 వేల నుంచి రూ.లక్ష 50 వేల వరకు ఖర్చు అవుతుంది. దీంతో డబ్బు కోసం కక్కుర్తి పడి కాలుష్య జలాలు పారవేసే కేటుగాళ్లతో కొన్ని పరిశ్రమలు చేతులు కలిపి ఎక్కడిక్కడ పారవేస్తున్నారు.

### నిధులున్నా శుద్ధి కేంద్రాల ఏర్పాటు ఏదీ?

సమీపంలో వ్యర్థాల శుద్ధి కేంద్రం లేకపోవటం సమస్యకు ప్రధాన కారణం. నిత్యం ఇక్కడి నుంచి అనుమతి ఉన్న పరిశ్రమల వ్యర్థాలను జేఈటీఎల్ జీడిమెట్ల, పీఈటీఎల్ పటాన్‌చెరు, ఘన వ్యర్థాలు రాంకీ వేస్ట్‌మేనేజ్ మెంట్ ప్లాంట్‌లకు తరలిస్తున్నారు. మండలానికి దూరంగా శుద్ధి కేంద్రాలు ఉండటంతో పరిశ్రమల నుంచి వెళ్లే కాలుష్య జలాల ట్యాంకర్లు ఏ ప్రాంతాలకు వెళుతున్నాయో గుర్తించే వ్యవస్థ సక్రమంగా లేదు. నిబంధనల ప్రకారం ఉదయం 6 నుంచి సాయత్రం 6గంటల మధ్యే రసాయనాలు తరలించాలి. కానీ పారిశ్రామిక ప్రాంతాల్లో చాలా వ్యర్థ జలాల వాహనాలు రాత్రి వేళ కనిపిస్తున్నాయి. స్థానికంగా రసాయనాల శుద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉన్న అమలు చేయకపోవటంతో అక్రమార్కులకు కలిసివస్తుంది. నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటు సమయంలో వసూళ్ల చేసిన 2 శాతం నిధులలోంచి సుమారు రూ.12 కోట్లతో మండలంలో రెండు ఎఫ్లయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ల ఏర్పాటు చేపట్టాలనే ప్రతిపాదనలున్నా ఆచరణ ఎప్పుడో తెలియని పరిస్థితి నెలకొన్నది. ఇందులో బొల్లారం ఆసానికుంట శుద్ధి, ఇక్కడే ఈటీపీ ఏర్పాటు ప్రతిపాదనలు ఏళ్ల తరబడి కాగితాలకే పరిమితవడంతో ప్రజలకు కాలుష్యం తప్పడం లేదు.



బొల్లారంలో కాలుష్య జలాలతో నిండిన ఆసానికుంట

## 'ఎల్ఆర్ఎస్' ప్రక్రియ వేగవంతం చేయాలి

● అధికారులను ఆదేశించిన మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



మెదక్ అర్బన్, సెప్టెంబరు 13: లాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్(ఎల్ఆర్ఎస్) కింద దరఖాస్తుల ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను సమర్థవంతంగా పరిష్కరించాల్సిన అవసరముందన్నారు. ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి.. మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల వారీగా దరఖాస్తుల వర్గీకరణపై అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత ప్రజాపాలన ప్రారంభించే అవకాశం ఉందని, ఆదేశాలు రాగానే ఈ ప్రక్రియ కొనసాగించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఈ నెల 17న ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా అన్ని పాఠశాలలు, కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య, ఎంపీడీవో, ఎంపీవోలు, ఇరిగేషన్ ఏఈలు, రెవెన్యూ ఆర్ఐలు, మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## మనోహరాబాద్‌లో హిందీభాషా దినోత్సవం

మనోహరాబాద్, సెప్టెంబరు 13: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ హిందీ భాషా దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. 1949 సెప్టెంబరు 14న భారత రాజ్యాంగంలో హిందీని జాతీయ భాషగా ఆమోదించారు. అందుకే మన దేశంలో ఏటా సెప్టెంబరు 14ను హిందీభాషా దివస్‌గా జరుపుకుంటాం. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృపాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు పాడై పదేళ్లు గడిచినా పట్టించుకోరా?

● గుంతలమయమై కంకర తేలిన మనియార్‌పల్లి-బడంపేట రోడ్డు
● కర్ణాటక రాష్ట్రానికి అనుసంధానంగా ఉన్న ఈ రోడ్డు మరమ్మతులకు రూ.2.85 కోట్లు మంజూరైనా పట్టించుకోని వైనం



గుంతలు పడి అధ్వానంగా మారిన మనియార్‌పల్లి-బడంపేట రోడ్డు

కోహీర్, సెప్టెంబరు 13: మండల పరిధిలోని మనియార్‌పల్లి-బడంపేట గ్రామాల మధ్యన ఉన్న ప్రధాన రహదారి పాడైపోయి పదేళ్లు గడిచినా ఇంతవరకు పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంపై స్థానికులు మండిపడుతున్నారు. రోడ్డు అంతా గుంతలమయమై పూర్తి అధ్వానంగా తయారైంది.

### నిధులు మంజూరైనా ..

జహీరాబాద్ మండలం శేఖాపూర్ నుంచి కోహీర్ మండలంలోని బడంపేట మీదుగా మనియార్‌పల్లి గ్రామం వరకు సుమారు 6 కిలోమీటర్లు ఉన్న ఈ రోడ్డు పునర్నిర్మాణం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2.85 కోట్లు మంజూరు చేసింది. అయితే కంకర తేలి ప్రమాదకరంగా తయారైనా ఈ రోడ్డును మాత్రం బాగు చేయడం లేదు. రోడ్డును బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు సంబంధిత పంచాయతీరాజ్ అధికారులకు తెలియజేసినప్పటికీ ఈ రోడ్డును బాగు చేయడంలేదు. పక్క రాష్ట్రమైన కర్ణాటకకు అనుసంధానంగా ఉన్న ఈ రోడ్డును బాగు చేయకపోవడమేమిటని పలు గ్రామాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ దారి గుండా తాండూరు కర్ణాటక తదితర ప్రాంతాలకు ప్రజలు వెళ్తుంటారు. ముఖ్యంగా బడంపేట గ్రామంలో గల శ్రీరాచన్నస్వామి ఆలయం ఉండడంతో చాలా మంది భక్తులు ఈ రోడ్డు గుండానే రాకపోకలు సాగిస్తారు. ఇదివరకే చాలా మంది ద్విచక్ర వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణిస్తూ గుంతల కారణంగా వాహనాలు అదుపు తప్పి గాయపడిన కోకొల్లలుగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు జరిపించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### రోడ్డుకు మరమ్మతులు జరిపించండి



కంకర తేలి ప్రమాదకరంగా మారిన మనియార్‌పల్లి-బడంపేట గ్రామాల మధ్య గల రోడ్డును అధికారులు వెంటనే బాగు చేయాలి. ఈ రోడ్డుపై రాత్రివేళల్లో ప్రయాణించాలంటే భయంగా ఉంది. ఇప్పటివరకు మా గ్రామస్థులు ఎంతో మంది రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో పడి గాయాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు జరిపించాలి.

- నర్సింలు, బడంపేటవాసి

### ప్రతిపాదనలు పంపాం

పాడైపోయిన పర్శపల్లి, బడంపేట మీదుగా మనియార్‌పల్లి గ్రామం వరకు ఉన్న పంచాయతీరాజ్ రోడ్డు పునర్నిర్మాణం కోసం ఇటీవలనే ప్రభుత్వానికి కొత్తగా రీ ఎస్టిమేషన్ ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే రోడ్డు నిర్మాణం పనులు చేపట్టడం జరుగుతుంది.

-రత్నం, పీఆర్ ఏఈ కోహీర్

## యువకుడి అదృశ్యం



సత్య

రామచంద్రాపురం, సెప్టెంబరు 13: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని జ్యోతిరావుపూలే కాలనీలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ వివరాల ప్రకారం... పూలేకాలనీ నివాసముంటున్న సత్య(31) ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. ఈ నెల 8న సంస్థలో వినాయక మండపాన్ని ఏర్పాటు చేశారని మూడు రోజుల పాటు ఇంటికి రానంటూ భార్య సునితతో చెప్పి వెళ్లాడు. ఎంతకీ భర్త తిరిగి రాకపోవడంతో ఇరుగు పొరుగువారిని, బంధువులను విచారించినా ఫలితం లేకపోయింది. దీంతో శుక్రవారం కొల్లూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రవీందర్ తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

నారాయణఖేడ్, సెప్టెంబరు 13: ఖేడ్ మండలం వెంకటాపూర్‌కు చెందిన మహిళా రైతు మచ్కూరి లక్ష్మికి చెందిన ఎద్దు శుక్రవారం గ్రామ శివారులో మేత మేస్తూ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వద్ద ఎర్తింగ్ తీగను తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఎద్దు విలువ రూ.1.25 లక్షలు ఉంటుందని బాధితురాలు వాపోయింది. ప్రభుత్వం బాధితురాలికి పరిహారం అందజేసి ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

## వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం: ఆర్డీవో

నర్సాపూర్, సెప్టెంబరు 13: నర్సాపూర్ డివిజన్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న 220 ఇళ్లకు ఒక్కొక్క బాధిత కుటుంబానికి రూ. 16,500 చొప్పున పరిహారం అందచేసినట్లు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నర్సాపూర్ డివిజన్ పరిధిలో 219 పాక్షికంగా ఇళ్లు దెబ్బతినగా, ఒక్కటి పూర్తిగా దెబ్బతిన్నదని వాటికి సంబంధించిన బాధితులకు పరిహారాన్ని వారి అకౌంట్‌లో నేరుగా ప్రభుత్వం జమచేసినట్టు చెప్పారు.

## సాహితీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంపు




సంగారెడ్డిలో నిర్వహించిన హెల్త్ క్యాంపులో రెడ్ క్రాస్ సొసైటీ, సాహితీ ఆస్పత్రి యాజమాన్యం

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 13: సంగారెడ్డిలోని బైపాస్ రోడ్డులోని గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, సాహితీ ఆస్పత్రి సంయుక్త సహకారంతో శుక్రవారం ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించారు. సుమారు 100 మంది రక్త పరీక్షలు, షుగర్, బీపీ తదితర పరీక్షలు చేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సి.వనజారెడ్డి, జిల్లా ట్రెజరర్ ప్రసాద్, యూత్ కన్వీనర్ ఆకాశ్‌ప్రీతం, సాహితీ ఆస్పత్రి ఎండీ రాముసాహితి, డా.శ్రీనివాస్, బ్యాంకు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉనికి కోసమే బీఆర్ఎస్ డ్రామాలు

● డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్, సెప్టెంబరు 13: కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలన సాగిస్తుండటాన్ని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులు డ్రామాలు ఆడుతు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ విమర్శించారు. శుక్రవారం నర్సాపూర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆంజనేయులుగౌడ్ విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మహిళలను కించపరిచే విధంగా మాట్లాడటంతో పాటు రెచ్చగొట్టే విధంగా వ్యవహరించడం వల్లనే రాద్ధాంతం అయిందే తప్ప ఇతర కారణాలేవి లేవన్నారు. రెండురోజుల క్రితం నర్సాపూర్‌కు హరీశ్‌రావు వచ్చి విలేకరుల సమావేశంలో సర్పంచులకు బిల్లులు ఇవ్వకపోవడంతో అప్పుల పాలయ్యారని అనడం విడ్డూరంగా ఉందన్నారు. వారికి సకాలంలో బిల్లులు ఇవ్వక వారిని అప్పుల పాలు చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. సమావేశంలో మాజీ ఎంపీపీలు జ్యోతిసురేష్‌నాయక్, నరేందర్‌రెడ్డి, లలిత, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, రిజ్వాన్, మండల పార్టీ అధ్యక్షులు మల్లేశం, మహేశ్వర్‌రెడ్డి, మల్లేశంగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 13: మహిళలు, చిన్నారులు, తల్లులు అంగన్‌వాడీ సేవలను వినియోగించుకొని ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ రమ అన్నారు. శుక్రవారం మండలంలోని మక్త భూపతిపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ టీచర్లు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్న ప్రాసన నిర్వహించారు. కార్యక్రమానికి కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు మహేశ్వరి, అఖిల, గర్భిణులు, బాలింతలు, ప్రీ స్కూల్ పిల్లల తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీల్లో ఓటరు జాబితా ప్రదర్శన



కోహీర్ ఎంపీడీవో కార్యాలయంలో ఓటరు ముసాయిదా జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీవో

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శుక్రవారం ఓటరు జాబితాను నోటీసు బోర్డులపై ప్రదర్శించారు. ఈ నెల 14 నుంచి ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రజలకు ఓటరుజాబితా అందుబాటులో ఉంటుందని, ఏమైనా అభ్యంతరాలుంటే గడువులోగా పంచాయతీ కార్యదర్శులకు ఫిర్యాదు చేయవచ్చని ఎంపీడీవోలు తెలిపారు.

జహీరాబాద్, సెప్టెంబరు 13: జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లోని ఆయా గ్రామపంచాయతీల్లో శుక్రవారం ఓటరు జాబితాను ప్రదర్శించినట్టు ఎంపీడీవోలు మహేందర్ రెడ్డి, మహేష్ పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి 19వరకు పంచాయతీల్లో ఓటరు జాబితాను అందుబాటులో ఉంటుందన్నారు. అభ్యంతరాలుంటే ఆయా పంచాయతీల కార్యదర్శులకు ఫిర్యాదులు చేయాలన్నారు. 21న తుదిజాబితాను పంచాయతీల్లో ప్రచురిస్తామని వారు వివరించారు.

● కోహీర్: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద శుక్రవారం ప్రదర్శించిన ఓటరు జాబితాపై అభ్యంతరాలను తెలియజేయాలని కార్యదర్శులు తెలిపారు. ఈ నెల 14నుంచి 21వ తేదీ వరకు ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, 26వ తేదీ వరకు అభ్యంతరాలు పరిష్కరించనున్నట్టు ఎంపీడీవో భారతి తెలిపారు. 28న ఓటరు తుది జాబితాను జీపీలు, ఎంపీడీవో కార్యాలయాల్లో ఏర్పాటు చేస్తారని తెలిపారు.

● జిన్నారం: జిన్నారం పంచాయతీ కార్యాలయంలో ఓటరు జాబితాను అధికారులు ఏర్పాటు చేశారు. ఏమైనా ఫిర్యాదులుంటే కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని కార్యదర్శి లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు.

● కంది: కంది మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రదర్శించిన ఓటరు జాబితాలపై అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు.

● తూప్రాన్: తూప్రాన్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల ఎన్నికల ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేసినట్లు జడ్పీసీఈవో, మండల ప్రత్యేక అధికారి ఎల్లయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీవో శేషాద్రితో కలిసి డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేయగా, గ్రామ పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు జాబితాను ప్రదర్శించారు.

● మనోహరాబాద్: మండలంలో గ్రామ పంచాయతీల వారిగా ముసాయిదా ఓటర్ల జాబితా జాబితాపై ఈ నెల 14 నుంచి 21 వరకు అభ్యంతరాలను స్వీరించనున్నట్లు కార్యదర్శులు తెలిపారు.

● వెల్దుర్తి: మండలంలోని పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించిన ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే ఈ నెల 21 వరకు ఫిర్యాదు చేయాలని ఎంపీడీవో ఉమాదేవి తెలిపారు.

● చేగుంట: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద శుక్రవారం అధికారులు ముసాయిదా ఓటర్ల జాబితా ఏర్పాటు చేశారు. ఈ నెల 19న మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి అన్ని పార్టీల అధ్యక్షులు హాజరు కావాలని ఎంపీడీవో చిన్నారెడ్డి తెలిపారు.

## రాజీపడే కేసులన్నీ పరిష్కరించండి

● మూడో అదనపు జిల్లా న్యాయాధికారి సునీతారెడ్డి

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 13: ఈనెల 28న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి అనుకూలమైన కేసులన్నీ పరిష్కరించాలని మూడో అదనపు జిల్లా న్యాయాధికారి జి.సునీతా రవీంద్రా రెడ్డి అధికారులకు సూచించారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో శుక్రవారం బ్యాంకు, ఇన్సురెన్స్, చిట్‌ఫండ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మోటార్ వెహికిల్ ప్రమాద కేసులు, బ్యాంకు మొండి బకాయిలు, చిట్‌ఫండ్ కేసులు ఎక్కువ సంఖ్యలో పరిష్కారమయ్యే విధంగా చూడాలని అన్నారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్‌తో పాటు ఇన్సూరెన్స్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

## పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను సన్మానించిన జిల్లా ఎస్పీ

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 13: హత్యాచార నిందితుడికి ఉరి శిక్ష పడేందుకు కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనంతరావు కులకర్ణిని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అభినందించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆయనను జిల్లా ఎస్పీ మెమొంటో, నగదుతో పాటు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గత సంవత్సరం 16వ తేదీన బీడీఎల్ భానూరులో ఆరేళ్ల చిన్నారిని హత్యాచారం చేసిన ఘటనలో నిందితుడు గఫార్ అలీ ఖాన్‌కు ఉరి శిక్ష పడేలా పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనంతరావు కులకర్ణి కోర్టులో వాదనలు వినిపించారన్నారు.

## మానసిక ఒత్తిడిని అధిగమిస్తే చదువులో రాణిస్తారు

● జిల్లా మహిళ సాధికారత కేంద్రం సమన్వయ కర్త

కంది, సెప్టెంబరు 13 : విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమిస్తేనే చదువులో రాణిస్తారని జిల్లా మహిళ సాధికారత కేంద్రం సమన్వయ కర్త పల్లవి అన్నారు. కంది జడ్పీహెచ్‌లో శుక్రవారం నాడు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మిషన్‌శక్తి వంద రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లవి ఆ పాఠశాల విద్యార్థులకు విద్యా ప్రాముఖ్యత, ఒత్తిడిని అధిగమించే విధానాలు, బాలికల భద్రత చట్టాలు, సోషల్ మీడియా సమస్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ సాయిశంకర్ విద్యార్థులకు ఆరోగ్య సూచనలు చేశారు.

## తారా కళాశాలలో జాబ్‌మేళాకు స్పందన

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 13: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయనశాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో రెడ్డీస్ ల్యాబ్ వారి సహకారంతో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. 2023-24 ఏడాదిలో పాసైన అభ్యర్థులు ఈ జాబ్‌మేళాలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రెడ్డీస్ ల్యాబ్ హెచ్ఆర్ మోహన్‌రావు, హెచ్ఆర్ ప్రోగ్రాం మేనేజర్ రామరాజు, బ్లాక్ ఇన్‌చార్జి రఘునందన్‌లు అభ్యర్థులకు పరీక్ష నిర్వహించి, ఇంటర్వ్యూల్లో ఎంపిక చేశారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మైనంపల్లి హనుమంత రావు

హవేళిఘణపూర్, సెప్టెంబరు13: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మండల స్థాయి ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు శ్రీనివాస్, మజీ ఎంపిటీసి శ్రీకాంత్, రాము శశికుమార్, అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

## పలు మండలాల్లో ఎస్జీఎఫ్ క్రీడలు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 13: స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానంలో మండల స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈవో నీలకంఠం ప్రారంభించారు. అండర్ 14, 17 బాలబాలికలకు జరిగిన ఖోఖో పోటీల్లో 16 పాఠశాలల క్రీడాకారులు పాల్గొనగా.. 44 మంది క్రీడాకారులు జిల్లాకు ఎంపికయ్యారు. విజేతలకు డీఈవో రాధాకిషన్, ఎంఈవో నీలకంఠం, డా. చంద్రశేఖర్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

● మనోహరాబాద్, సెప్టెంబరు 13: మనోహరాబాద్ మండల కేంద్రంలో జీఎంజే పాఠశాలలో ఎస్‌జీఎఫ్ క్రీడలు నిర్వహించారు. ఈ క్రీడలకు ముఖ్య అతిథిగా మండల నోడల్ అధికారి మల్లేశం చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ క్రీడలలో ఇతర ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయి ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ అండర్-14, అండర్- 17 విభాగాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి పోటీలకు కబడ్డీ నుంచి 12 మంది, ఖోఖో నుంచి 13 మందిని, వాలీబాల్ జట్టును ఎంపిక చేశారు.

## రైతాంగ సాయుధ పోరాటంలో సీపీఐది కీలకపాత్ర: మంద పవన్




బైరాన్‌పల్లి అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

దూళిమిట్ట, సెప్టెంబరు 13: రైతాంగ సాయుధ పోరాటంలో సీపీఐది కీలకపాత్ర అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. శుక్రవారం మండలంలోని బైరాన్‌పల్లి గ్రామంలో అమరవీరుల స్తూపం పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బురుజు వద్ద పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం అలుపెరుగని పోరాటం చేసి 4,500 మంది కమ్యూనిస్టులు రక్తాలు చిందించి 10 లక్షల ఎకరాల భూములను పేదలకు పంచిన చరిత్ర సీపీఐ పార్టీదేనన్నారు. సాయుధ పోరాట అమరవీరుల స్ఫూర్తితో 76వ వార్షికోత్సవాలను సీపీఐ ఆధ్వర్యంలో 11 నుంచి 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, కృష్ణపురం లక్ష్మణ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈరు భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రంగాలవారికి కాంగ్రెస్ అండ: మెదక్ ఎమ్మెల్యే

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 13: కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల వారికి అండగా ఉంటుందని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేట ఉమ్మడి మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే రోహిత్‌రావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, తహసీల్దార్ మన్నన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరేందర్, ఆర్ఐ గోవింద్, నాయకులు పాల్గొన్నారు.

## కోహీర్ పాఠశాలలో రూ.10 లక్షలతో మరుగుదొడ్లు, వాటర్‌ప్లాంట్



పాఠశాలలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సెయింట్ గోబైన్ పరిశ్రమ డైరెక్టర్ ఫణికుమార్

కోహీర్, సెప్టెంబరు 3: ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత కలిగి ఉన్నప్పుడే దేశం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందని మండలంలోని కవేల్లి చౌరస్తా వద్దగల సెయింట్ గోబైన్ ఇండియా లిమిటెడ్ డైరెక్టర్ ఫణికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సెయింట్ గోబైన్ ఇండియా లిమిటెడ్ వారు 10 లక్షల సీఎస్ఆర్ నిధులతో విద్యార్థినుల సౌకర్యార్థం నిర్మించిన మరుగుదొడ్లు తాగునీటి వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు కార్యక్రమంలో ఎంఈవో శంకర్, ప్రధానోపాధ్యాయురాలు ఆశాలత, మండల నోడల్ అధికారి జాకీర్ హుస్సేన్, పరిశ్రమ అధికారులు ప్రసాద్, నితిన్, రమేష్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థినులు తదితరులు ఉన్నారు.

## ఉపాధిహామీ పనులను పరిశీలించిన డీఆర్డీఏ పీడీ

నర్సాపూర్, సెప్టెంబరు 13: మండలంలోని పెద్దచింతకుంట గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను శుక్రవారం డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్ రావు సందర్శించి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫాంపాండ్స్, నిమ్మతోట ప్లాంటేషన్ పనులను పరిశీలించి పలు సూచనలు స్థానిక సిబ్బందికి ఇచ్చారు.

# బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు

**మాజీమంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిల అరెస్టును నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ నివాసం ముట్టడికి తరలివెళ్లేందుకు బీఆర్ఎస్ అధిష్టానం పిలుపు నివ్వడంతో గురువారం రాత్రి అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు పోలీసులు బీఆర్ఎస్ నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా పలుచోట్ల ఎమ్మెల్యే గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు.**



జిన్నారం: కాజీపల్లి వద్ద ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మెదక్ మున్సిపాలిటీ: కొంపల్లిలోని నివాసంలో మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

● జిన్నారం, సెప్టెంబరు 13: మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాజేష్, మాజీ సర్పంచ్ వెంకటేశంగౌడ్, మాజీ ఎంపీటీసీ భార్గవ ఆధ్వర్యంలో పలు గ్రామాల కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ నివాసానికి తరలివెళ్లారు. అంతకు ముందు కాజీపల్లి వద్ద ఎమ్మెల్యే గాంధీ చిత్రపటాన్ని, దిష్టిబొమ్మను దహనం చేసి ఆందోళన కార్యక్రమానికి తరలివెళ్లారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు గాంధీ నివాసానికి తరలివెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

● కోహీర్: కోహీర్ మండలంలోని బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌కు తరలివెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వారి వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఖలీమ్, ఇష్తేకర్, సందీప్, దినకర్ ఉన్నారు.

● ఝరాసంగం: మండలం నుంచి హైదరాబాద్‌కు తరలి వెళ్లడానికి సిద్ధమైన నాయకులను పోలీసులు శుక్రవారం ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయినవారిలో మండల బీఆర్ఎస్‌పార్టీ అధ్యక్షుడు వెంకటేశం, మాజీ అధ్యక్షుడు సంగమేశ్వర్, నాయకులు ఉన్నారు.

● జహీరాబాద్: బీఆర్ఎస్ చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు వారిని ముందస్తు అరెస్టులు చేసి జహీరాబాద్, జహీరాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అరెస్టు అయిన వారిలో పీఏసీఎస్ చైర్మన్ మచ్చేందర్, మండల బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తట్టునారాయణ, నాయకులు, కార్యకర్తలున్నారు.

● గుమ్మడిదల: మండలం నుంచి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు హైదరాబాద్‌కు తరలుతుండగా పోలీసులు వారిని అదుపులో తీసుకొని అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దేవేందర్‌రెడ్డి, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, మంద భాస్కర్ రెడ్డి, గోరీశంకర్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● మనూరు: మనూరులో బీఆర్ఎస్ నాయకుల చలో హైదరాబాద్‌ను అడ్డుకునేందుకు పోలీసులు ముందస్తుగా ముఖ్యనాయకులను అరెస్టు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విఠల్‌రావు, మాజీ జడ్పీటీసీ నాగేందర్ నాయకులు తదితరులు ఉన్నారు.

● నాగల్‌గిద్ద: మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మేత్రి పండరితో పాటు మొత్తం 13 మంది బీఆర్ఎస్ నాయకులను శుక్రవారం ముందస్తు అరెస్టు చేసినట్లు ఎస్ఐ బి.సాయిలు తెలిపారు. అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

● నారాయణఖేడ్: ఛలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఖేడ్‌లో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రుబీనాబేగం నజీబ్, మాజీ వైస్ చైర్మన్ పరశురాం, కౌన్సిలర్ విఠల్, కోఆప్షన్‌సభ్యులు, లాయక్, నాయకులు ఉన్నారు.

● రామచంద్రాపురం: బీఆర్ఎస్ నాయకుల చలో హైదరాబాద్ కార్యక్రమం నేపథ్యంలో తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ బి.రాములుగౌడ్‌ను బీడీఎల్ పోలీసులు గురువారం అర్ధరాత్రి హౌస్ అరెస్ట్ చేశారు.

● మునిపల్లి: మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పైతర సాయికుమార్ అన్నారు. అక్రమంగా అదుపులోకి తీసుకున్న వారిని వెంటనే విడుదల చేయాలని, కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సాయికుమార్ డిమాండ్ చేశారు.

● మెదక్ మున్సిపాలిటీ : బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకుల చలో హైదరాబాద్ నేపథ్యంలో శుక్రవారం ఉదయం పద్మారెడ్డి నివాసంలో కొంపల్లి పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఆమెతో పాటు జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు మల్లికార్జున్‌గౌడ్, మామిళ్ల ఆంజనేయులు, ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, ఆరెకె శ్రీనివాస్, వంజరి జయరాజ్, శ్రీనివాస్, జయరాంరెడ్డి, సాప సాయిలు, ప్రభాకర్, ఎలక్షన్‌రెడ్డి, గంజి నవీన్, శ్రీనివాస్‌గౌడ్‌లను మెదక్ పట్టణ, రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు.

● తూప్రాన్: తూప్రాన్ పట్టణంలో ఎస్ఐ శివానందం ఆధ్వర్యంలో మండలానికి చెందిన 27 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు అయిన వారిలో కౌన్సిలర్ మామిడి వెంకటేశ్, నాయకులు దుర్గారెడ్డి, బొంది వెంకట్‌గౌడ్, సత్యలింగం, తదితరులు ఉన్నారు.

● మనోహరాబాద్: మండలంలోని బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టయినవారిలో మాజీ ఎంపీపీ నవనీతరవి, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

● వెల్దుర్తి: మండలంలోని బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్టయినవారిలో మాజీ జడ్పీటీసీ రమేష్‌గౌడ్, మాజీ మెదక్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ క్రిష్ణగౌడ్, నాయకులు తదితరులు ఉన్నారు.

● నర్సాపూర్: నర్సాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులను శుక్రవారం ఉదయమే పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ నయిమోద్దీన్, మండల పార్టీ అధ్యక్షులు శేఖర్, పట్టణ అధ్యక్షులు భిక్షపతి, నాయకులు తదితరులున్నారు.

● చిన్నశంకరంపేట: మండలంలోని బీఆర్ఎస్ మాజీ సర్పంచులు,నాయకులనుపోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

● చేగుంట: మండలంలోని బీఆర్ఎస్ నాయకుల చలోహైదరాబాద్‌ను అడ్డుకునేందుకు పోలీసులు శుక్రవారం ఉదయం వారిని ముందస్తు అరెస్టులు చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నారాయణ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మోదం శ్రీనివాస్, మాజీ సర్పంచులు తదితరులు ఉన్నారు.

●పెద్దశంకరంపేట: మండలంలోని బీఆర్ఎస్ నాయకులను ఎస్ఐ శంకర్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేశారు.

● అల్లాదుర్గం: మండలంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులను అల్లాదుర్గం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. అరెస్టయినవారిలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సింలుతో పాటు పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు దశరథ్, నాయకులు ఉన్నారు.